

సత్యదీక్షలు ప్రారంభం
అన్నవరం సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం దేవస్థానంలో శ్రీ సత్యదీక్షలు ప్రారంభమయ్యాయి.
10లో



నయన మనోహరం
వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రమణీయంగా జరిగాయి.
10లో

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నేడు మూడుచోట్ల వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని వేళ్లచింతలగూడెం (గోపాలపురం), ధవళేశ్వరం–4 (రాజమహేంద్రవరం రూరల్), కొత్తతుంగపాడు (రాజానగరం) విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో బుధవారం జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం ఈ విషయం తెలిపారు.

1,679 మందికి వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం మూడుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. డీఎంహెచ్ఓ కె.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్ మౌనిక ఈ విషయం తెలిపారు. వీటిలో 1,679 మంది వైద్య సేవలు పొందగా, 15 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారని వివరించారు.

సీతానగరంలో భారీ వర్షం

కొవ్వూరు: జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 గంటలతో గడచిన 24 గంటల వ్యవధిలో 8.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సీతానగరంలో గరిష్ఠంగా 72.1, తాళ్లపూడి 30.2, బిక్కవోలు 16.6, నిడదవోలు 12.2, అనపర్తి 9.8, కోరుకొండ 7.4, రాజమహేంద్రవరం రూరల్ 4.6, గోపాలపురం 5.8, ఉండ్రాజవరం 3.8, కడియం 1.4, రాజానగరం ఒక మిల్లీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైంది.

2,104.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ ఖరీఫ్‌లో లక్ష్యం మేరకు 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం సేకరణకు మంగళవారం నాటికి 559 కూపన్లు జనరేట్ చేశామన్నారు. 308 మంది రైతుల నుంచి 2,104.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. సమస్యలపై ఫిర్యాదుకు కలెక్టరేట్‌లో 83094 87151, 0883–2940788 నంబర్లతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు.

మహిళల రక్షణ దిశగా..



- ఆపదలో అతివలకు అండ
- ఆదుకుంటున్న 'దిశ' పోలీస్ స్టేషన్, యాప్
- బటన్ నొక్కగానే తక్షణమే కాపాడుతున్న పోలీసులు
- దేశంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరంలో ప్రత్యేకంగా ఏర్పాటైన స్టేషన్
- 2020లో ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- ఎంతోమంది మహిళలకు మేలు



రాజమహేంద్రవరంలోని దిశ పోలీస్ స్టేషన్

సాక్షి, రాజమహేంద్రవరం: బాలికలు, యువతులు, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం వేసిన అడుగులు సత్ఫలితాలనిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'దిశ' పేరిట తీసుకు వచ్చిన ప్రత్యేక వ్యవస్థ అతివలకు తక్షణ రక్షణ కల్పిస్తోంది. తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పేందుకు మహిళలు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కకుండా పోలీసులే వారి చెంతకు వెళ్లి, అండగా నిలిచి సాయం అందించే వ్యవస్థ చేరువైంది. ఇందుకు గాను దిశ ఎస్ఓఎస్ పేరిట ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. జిల్లాలో వేలాది మంది మహిళలు దిశ సేవలు వినియోగించుకుని రక్షణ పొందుతున్నారు.



దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

అన్ని సౌకర్యాలతో..

దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాజమహేంద్రవరంలో 2020 ఫిబ్రవరి ఎనిమిదో తేదీన దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకూ మహిళల భద్రతకు, వారికి తక్షణ సాయం అందించేందుకు కృషి చేస్తోంది. స్టేషన్‌లో సిబ్బందికి, దిశ సేవలు అందించే పోలీసులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఒక బస్సు, ఒక మినీ బస్సు, ఒక పెట్రోలింగ్ జీప్, డే–బీట్‌కు 2 ద్విచక్ర వాహనాలు, ఒక స్కూటీ కేటాయించారు. వాహనాల్లో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు 24 గంటలూ గస్తీ తిరుగుతూంటారు. ఉదయం వేళల్లో పాఠశాలలు, కళాశాలలు, పోకిరీలు సంచరించే ప్రాంతాల్లో నిఘా వేస్తారు. బాలికలు, యువతులు, మహిళలపై నేరాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఫోన్ వచ్చినా, దిశ యాప్ ఎస్ఓఎస్ మెసేజ్ వచ్చినా మరుక్షణమే ఘటనా స్థలానికి చేరుకుంటారు.

సత్వర పరిష్కారం

దిశ యాప్ మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపుతోంది. దిశ ఎస్ఓఎస్‌కు ఫోన్ కాల్ వచ్చిన వెంటనే నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలుస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, వుమెన్ ఫ్రెండ్లీ విధానం అందుబాటులోకి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా 26 పోలీస్ స్టేషన్లలో ఈ హెల్ప్ డెస్క్‌లు అందుబాటులో ఉన్నాయి. స్టేషన్‌కు అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ కలహాలు, మహిళలపై వేధింపుల కేసులను పరిష్కరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 5,632 ఫిర్యాదులు అందగా.. 4,642 ఫిర్యాదులకు స్నేహపూర్వక పరిష్కారం (కాంప్రమైజ్) చూపారు. 944 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 46 పరిష్కరించాల్సి ఉంది.

యజ్ఞంలా యాప్ డౌన్‌లోడ్

దిశ సేవలు పొందాలంటే ప్రధానంగా యాప్ ఉండాలి. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి మహిళ వద్దకూ ఈ యాప్ చేరేలా డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించారు. ప్రజలు అత్యధికంగా సంచరించే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయం తదితర అనేక ప్రాంతాల్లో మహిళలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, ప్రతి ఒక్కరితో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా 11,26,895 మంది తమ సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ పనితీరు, మహిళలకు అందే తక్షణ రక్షణ తదితర అంశాలపై మహిళలు, విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించారు. దీనిపై విద్యా సంస్థలు, బస్టాండ్లు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ తదితర ప్రదేశాల్లో షి, శక్తి, మహిళా పోలీసు బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి.

ఏ క్షణమైనా స్పందిస్తాం



మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. మహిళలు, యువతులకు ఏదైనా సమస్య వచ్చి, దిశ యాప్ ద్వారా ఎస్ఓఎస్ బటన్ నొక్కి పట్టుకుంటే చాలు పోలీసులు మీ వద్దకు వచ్చి వాలిపోతారు. మొబైల్ ఇంటర్‌నెట్ లేకపోయినా ఎస్ఓఎస్ ద్వారా మాకు ఫోన్ వస్తుంది. 24 గంటల సమయంలో ఏ క్షణంలోనైనా పోలీసు సాయం పొందవచ్చు. దిశ యాప్ లేకపోయినా 100కు ఫోన్ చేసినా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ

మందుబాబులు, ప్రేమికులపై ప్రత్యేక నిఘా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. జనసంచారం లేని ప్రదేశాల్లో సంచరిస్తున్న ప్రేమికులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రేమికులు ఇద్దరే ఉన్న సమయంలో ఇతరులు దాడులు చేయడం వంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఒకే వాహనంపై ముగ్గురు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి, చైతన్యం నింపుతున్నారు.

బహిరంగ మద్యపానంపై చర్యలు	:	801
నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రేమికులకు కౌన్సెలింగ్	:	2,438
ట్రిపుల్ రైడింగ్	:	164
అవగాహన కార్యక్రమాలు	:	340

దిశ పోలీస్ స్టేషన్‌లో వినతులు పరిష్కరించారిలా..

సంవత్సరం	స్వీకరించిన వినతులు	స్నేహపూర్వక పరిష్కారం	ఎఫ్ఐఆర్ నమోదు	పెండింగ్
2020	960	836	124	–
2021	1,468	1,217	251	–
2022	1,748	1,415	333	–
2023 (అక్టోబర్ వరకూ)	1,456	1,174	236	46



దిశ పోలీస్ స్టేషన్ ప్రారంభ సందర్భంగా సీఎం జగన్ (ఫైల్)

అన్నదాతకు అన్నివిధాలా అండ



శ్రీరంగపట్నం రైతు భరోసా కార్యక్రమంలో రైతులకు చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- విత్తు నుంచి విక్రయం వరకూ తోడ్పాటు
- కలెక్టర్ కె.మాధవీలత, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ నిధుల విడుదల
- పుట్టపర్తి నుంచి జమ చేసిన సీఎం జగన్
- జిల్లాలో 1,41,096 మందికి రూ.58.55 కోట్ల లబ్ధి

మధురపూడి: అన్నదాతలకు అన్నివిధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులనుద్దేశించి ప్రసంగించారు. ఈ పథకం కింద వరుసగా ఐదో ఏడాది రెండో విడతగా జిల్లాకు చెందిన 1,41,096 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.58.55 కోట్లు జమ చేసిందని చెప్పారు. గడచిన ఐదేళ్లుగా జిల్లాకు చెందిన 1,41,096 మంది రైతులకు, కౌలు రైతుల ఖాతాల్లో రూ.650.60 కోట్ల మేర రైతుభరోసా మొత్తాన్ని ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజకూ ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహిస్తామని, ఎటువంటి సమస్యలున్నా కలెక్టరేట్, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోని కంట్రోల్ రూములకు ఫోన్ చేయాలని రైతులకు సూచించారు.

రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, వ్యవసాయం దండగ అనే గత పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా మార్చి, పండగ చేశారని, రైతులకు అడుగడుగునా వెన్నుదన్నుగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 సాయం అందిస్తున్నారని వివరించారు. విత్తనం నుంచి విక్రయం వరకూ రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమే కాకుండా భూసారాన్ని బట్టి ఎటువంటి పంటలు వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మెట్ట ప్రాంతాల్లో ఉచితంగా బోర్లు వేసి, విద్యుత్ అందిస్తోందన్నారు. మిర్తిపాడు కాజ్ వే కారణంగా ముంపు ఏర్పడుతున్నందున తొలగింపునకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ పనులకు రూ.35 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ముంపు సమస్యను తొలగించేందుకు రూ.91 కోట్లతో తొర్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం త్వరలో చేపట్టనున్నామని ఎమ్మెల్యే రాజా తెలిపారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, వరుసగా ఐదో ఏడాది రెండో విడతగా అర్హత ఉన్న ఒక్కొక్క రైతుకు రూ.4 వేల చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జెడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు (కోరుకొండ), వాసంశెట్టి పెద్ద వెంకన్న (రాజానగరం), ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, వైస్ ఎంపీపీ స్వర్ణలత, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కంటే వినయ్‌తేజ, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కో కన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ వుల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో రూ.60 వేల లబ్ధి



రైతుభరోసా కింద గత ఐదేళ్లలో నాకు రూ.60 వేల వరకూ లబ్ధి చేకూరింది. మా అబ్బాయి ఇంజినీరింగ్, మా అమ్మాయి ఇంటర్ చదువుతున్నారు. వారికి ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తోంది. ఇదేవిధంగా ప్రతి ఇంటికీ ఏదో ఒక మేలు జగన్ ప్రభుత్వంలో జరుగుతోంది. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వంలోనూ ఇలా జరగలేదు. రైతులకు భరోసా కల్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నాను.

– తనకాల ప్రసాద్, రైతు, శ్రీరంగపట్నం

సంతోషంగా ఉంది



రైతుభరోసా కింద నాలుగు విడతలుగా ఆర్థిక సహాయం అందింది. ఐదో విడత కూడా నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో సొమ్ము పడింది. ఈ డబ్బులు సాగు పెట్టుబడికి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మా అమ్మాయి లక్ష్మీప్రసన్నకు దివ్యాంగ పింఛన్ ఇంటి వద్దనే వలంటీర్ ద్వారా అందుతోంది. మా అమ్మకు వృద్ధాప్య పింఛను అందిస్తున్నారు. మా అమ్మాయికి విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ప్రభుత్వ తోడ్పాటుతో మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. జగనన్న దయతో మాలానే ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి.

– సూరిశెట్టి వెంకట్రావు, రైతు, శ్రీరంగపట్నం

చురుకుగా ఈవీఎంల తనిఖీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) తనిఖీ ప్రక్రియ చురుకుగా జరుగుతోంది. జిల్లాకు సంబంధించి నగరంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో ఇప్పటికే భద్రపరిచిన ఈవీఎంలను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి దశ తనిఖీ భారీ భద్రత నడుమ కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. గత నెల 16న ప్రారంభమైన ఈ ప్రక్రియకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతున్నారు. బెంగళూరులోని బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్ల ఆధ్వర్యాన జిల్లాకు సంబంధించి 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీ ప్యాట్ యూనిట్ల పనితీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. దీనిపై ఏ రోజుకు ఆ రోజే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇస్తున్నారు. ఈ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులెవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు ఉపయోగించే వీలు లేకుండా నిషేధం విధించారు. తనిఖీ ప్రక్రియను పూర్తిగా వెబ్ కాస్టింగ్‌లో రికార్డ్ చేస్తున్నారు. తనిఖీ ప్రక్రియకు 140 మంది సిబ్బందిని 20 బృందాలుగా నియమించారు. ఒక్కో బృందంలో ఆరుగురు చొప్పున ఉంటారు. మిగిలిన 20 మందిని రిజర్వ్‌లో ఉంచారు.

26 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

నల్లజర్ల: అక్రమంగా రవాణా చేస్తున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు మంగళవారం పట్టుకున్నారు. సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా గణపవరం నుంచి శ్రీనివాస ట్రేడర్స్ ఆధ్వర్యంలో 520 బస్తాల్లో (50 కిలోలు) లారీలో రవాణా చేస్తుండగా సివిల్ సప్లయి,రెవెన్యూ అధికారులు నల్లజర్ల వద్ద ఆపి సరకును స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవరు వర్రి క్రాంతిని సరకు ఎవరిదని అడుగ్గా కాకినాడ పోర్టు వద్దకు వెళ్లాక ఒక వ్యక్తి ఫోన్ చేస్తాడని సరకు అక్కడ దింపాలని చెప్పారన్నారు. లారీ ఒంగోలుకు చెందిన అడుసుమిల్లి కోటేశ్వరావుదిగా గుర్తించారు. 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింటుకు అప్పగించారు. అనంతరం 7(1)గా కేసు మార్పు చేసి లారీ డ్రైవరు, ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని సీఎస్ డీటీ సత్యనారాయణరావు తెలిపారు. ఈ దాడిలో ఆయనతోపాటు వీఆర్వోలు లక్ష్మణమూర్తి, సురేష్, వీఆర్ఏ సత్యనారాయణ ఉన్నారు.

పెద్దాపురంలో కారు బీభత్సం

ముగ్గురికి తీవ్ర గాయాలు



కారు ఢీకొనడంతో చెల్లాచెదురుగా పడిన బైకులు, గుమిగూడిన జనం

పెద్దాపురం: అనుభవం లేని వ్యక్తి కారు డ్రైవ్ చేయడంతో ముగ్గురు గాయాల పాలైన ఘటన మంగళవారం ఉదయం పెద్దాపురం దర్గా సెంటర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం డ్రైవింగ్‌లో అనుభవం లేని బంగారమ్మ గుడి వీధికి చెందిన ముప్పన వీరభద్రం సరదాగా కారు నడిపి నాలుగు బైక్‌లు, ఆటోను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అంబిక, సమ్మంగి దేవి, మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అజాగ్రత్తగా కారు నడిపిన వీరభద్రంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దాపురం ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

ప్రత్తిపాడు: యువకుడిపై హత్యాయత్నం ఘటన ప్రత్తిపాడులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుటి వీధిలో ఉంటున్న పోరుమిల్లి కిశోర్ జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కసిరెడ్డి అప్పారావు కుమార్తె గత నెల 26వ తేదీన ఉరి వేసుకుని మృతి చెందింది. తమ కుమార్తె మృతికి కిశోర్ కారణమని అప్పారావు భావించాడు. అప్పారావు, గనిశెట్టి సత్యనారాయణ, ఎన్నపరెడ్డి నాగ వెంకట రమణతో కలిసి కిశోర్ ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిశోర్ తల్లి సీతారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నయన మనోహరం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన



శ్రీకృష్ణ అలంకరణతో సాగిన సూర్యప్రభ వాహన సేవ



సప్త కలశారాధన నిర్వహిస్తున్న పండితులు

- రమణీయంగా కోనేటి రాయుడి బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగింపు
- ఘనంగా అష్టదళ పాద పద్మారాధన

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రమణీయంగా జరిగాయి. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన స్వామి, అమ్మవార్లను భక్తులు తన్మయత్వంతో తిలకించారు. సూర్య, చంద్రవాహనాలపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, వసంతోత్సవం, అష్టదళపాద పద్మారాధన, ప్రధాన హోమాలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాల అనంతరం స్వస్తి వచనం పలికారు. శ్రీ కృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం మోహినీ అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ సాగింది. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

స్వామివారికి పట్టువస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సభ్యులు మన్యం భాను, మెర్ల వేంకటేశ్వరరావు దంపతులు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు సమర్పించారు.

సూర్య, చంద్ర ప్రభ వాహనాల విశిష్టత

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీనివాసుడు సూర్య ప్రభ వాహనంపై ఊరేగుతాడు. సప్త అశ్వాలతో కదిలే ఈ వాహనం మీద నిలిచే స్వామి.. సూర్యుని ప్రతీకగా ఎర్రటి పూలమాలను ధరిస్తారు. సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై భక్తుల చెంతకు వస్తారు. పున్నమి నాటి చంద్రుడు పోలిన చంద్రవాహనం మీద శాంతికి, స్వచ్ఛతకు చల్లదనానికి ప్రతీక ఆయన తెల్లని వస్త్రాలతో కనుల పండగ చేస్తారు. సూర్య, చంద్ర ప్రభ వాహనంపై ఉన్న స్వామిని దర్శించుకుంటే కష్టాలు దరి చేరవని భక్తుల నమ్మకం.

నేటి కార్యక్రమాలు

బుధవారం ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, లక్షతులసిపూజ, లక్ష్మి వేంకటేశ్వర మూల మంత్రపూర్వక వేంకటేశ్వర హోమం, రాజాధిరాజ అలంకరణతో గజవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అమ్మవారికీ త్వరలో వజ్ర కిరీటం

- రూ.కోటిన్నర వ్యయమవుతుందని అంచనా
- ఆలస్యంపై 'అందివస్తే అలంకారమే' శీర్షికన 'సాక్షి'లో కథనం
- స్పందించిన ఈఓ చంద్రశేఖర్ అజాద్
- సందేహాలను నివృత్తి చేస్తూ దాతకు అనుమతి లేఖ

సాక్షి ఇంపాక్ట్





అన్నవరం: రత్నగిరి వాసుడు శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్ర కిరీటం తయారీకి మార్గం సుగమం అయింది. దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పెద్దాపురంలోని శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతలలో ఒకరైన మట్టే సత్యప్రసాద్ దంపతులు గతేడాది సత్యదేవునికి రూ.రెండు కోట్ల వ్యయంతో వజ్ర కిరీటం చేయించి సమర్పించారు. ఆ సందర్భంగా అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయించేందుకు దాత సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే వజ్రకిరీటం అమ్మవారికి శాశ్వతంగా అలంకరించాలనేది దాత మట్టే సత్యప్రసాద్ కోరిక. ఇందుకు దేవదాయ శాఖ నిబంధనలు అంగీకరించవని, నిర్దిష్ట కాలపరిమితి ముగిసిన తర్వాత ఇంతకన్నా ఎక్కువ వ్యయంతో పెద్ద కిరీటం మరో దాత తయారు చేయిస్తే అప్పుడు దాతతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దీనిపై దాత సత్యప్రసాద్ కొంత అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఫలితంగా కిరీటం తయారీ ఆలస్యమైంది.

దీంతో సత్యదేవుడు వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమిస్తుంటే అమ్మవారు స్వర్ణకిరీటంతో దర్శనమిస్తుండడం భక్తులను అసంతృప్తికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో వజ్రకిరీటం తయారీ ఆలస్యంపై 'అందివస్తే అలంకారమే' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ స్పందించి వజ్రకిరీటం తయారీకి దాత మట్టే సత్యప్రసాద్‌కు మంగళవారం లిఖిత పూర్వక అనుమతి ఇస్తూ లేఖ పంపించారు. ఆ లేఖలో దాత సందేహాలను ఈఓ నివృత్తి చేశారు. దీంతో దీనిపై స్పందించిన దాత త్వరలోనే వజ్ర కిరీటం చేయించి అమ్మవారికి సమర్పిస్తానని తెలిపారు. ఈ కిరీటం తయారీకి సుమారు రూ.కోటిన్నర వ్యయం అవుతుందని అంచనా.

త్వరగా చేయించమని దాతను కోరాం

సాధ్యమైనంత త్వరగా వజ్ర కిరీటం తయారు చేయించి అమ్మవారికి సమర్పించాలని దాతను కోరాం. గతంలో స్వామివారికి వజ్ర కిరీటం చేయించనపుడు కర్ణాభరణాలు చేయించలేదు. వాటిని కూడా చేయించాలని కోరాం. దాత కూడా అంగీకరించారు. కార్తికమాసంలో అమ్మవారు వజ్ర కిరీటంతో భక్తులకు దర్శనమివ్వాలని కోరిక.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఆలయ ఈఓ

పూర్వజన్మ సుకృతం

సత్యదేవునికి వజ్రకిరీటం చేయించిన తనకు అమ్మవారికి కూడా వజ్ర కిరీటం చేయించే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతం. సాధ్యమైనంత త్వరలోనే వజ్ర కిరీటం చేయించి అమ్మవారికి సమర్పించేందుకు ప్రయత్నిస్తాను. కార్తికమాసంలోనే కిరీటం సమర్పించే అవకాశం అమ్మవారు తనకు ఇవ్వాలని వేడుకుంటున్నా. తనకు ఈ అవకాశం కల్పించిన దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు కృతజ్ఞతలు.

– మట్టే సత్యప్రసాద్, దాత

రేపటి నుంచి కబడ్డీ టోర్నీ



వివరాలు వెల్లడిస్తున్న వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణంలో సౌత్ జోన్ ఇంటర్ యూనిర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీల నుంచి సుమారు 1,200 మంది ఆటగాళ్లు ఈ పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి ఆర్‌కే రోజా, అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.పద్మరాజు, ఇండియన్ యూనివర్సిటీస్ జాయింట్ సెక్రటరీ బల్జీత్ సింగ్ సేఖోన్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొంటారన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు తేదీ పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ నెల 7వ తేదీతో ముగిసిన గడువు తేదీని మరో వారం రోజులు పెంచుతూ విద్యాలయ సమితి నిర్ణయం తీసుకుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని రామకృష్ణయ్య తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: సుమారు 55 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ దాటిన తరువాత చోడవరం వెళ్లే రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నాడని రామచంద్రపురం ఎస్సై డి.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్‌ఓ కాగితపల్లి కనకదుర్గ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, నాచు రంగు ఫుల్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఎవరికైనా మృతుని వివరాలు తెలిస్తే 08857 242333, 94407 96589 ఫోన్ నంబర్లలో తెలియజేయాల్సిందిగా కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.1.40 లక్షల నగదు, 3.5 కాసుల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

కొత్తపేట: ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారం చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వీ మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అవిడి గ్రామంలో అన్నదమ్ములు దూళి వెంకటేశ్వరరావు, దూళి సుబ్రహ్మణ్యం ఒక ఇంట్లోని వేరు వేరు పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. వారు కుటుంబ సభ్యులతో సహా సోమవారం ఉదయం ఐ.పోలవరం మండలం తిల్లకుప్ప గ్రామంలో బంధువుల ఇంటికి ఒక కార్యక్రమం నిమిత్తం వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఆ అన్నదమ్ముల పోర్షన్ల బయట తలుపులు పగులకొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు పోర్షన్లలో బీరువాలు తెరిచి వాటిలో సామాన్లు చిందరవందరగా పడివున్నాయి. బీరువాలలో పరిశీలించగా భద్రపరిచిన నగదు, బంగారం వస్తువులు కనిపించలేదు. అవి అపహరణకు గురయినట్టు గుర్తించారు. అలా వెంకటేశ్వరరావు ఇంట్లో రూ.45 వేలు నగదు, మూడున్నర కాసుల బంగారం వస్తువులు, సుబ్రహ్మణ్యం ఇంట్లో రూ.95 వేలు నగదు చోరీకి గురయింది. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై మణికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. బాధిత అన్నదమ్ములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సత్యదీక్షలు ప్రారంభం



సత్యదీక్ష సందర్భంగా స్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం దేవస్థానంలో శ్రీ సత్యదీక్షలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి విడతల వారీగా భక్తులు రత్నగిరిపై శ్రీసత్యదేవుని ఆలయంతో బాటు శ్రీవనదుర్గ, శ్రీకనకదుర్గ, కొండ దిగువన వివిధ ఆలయాలలో అర్చకులు, గురుస్వాముల చేతుల మీదుగా ఈ దీక్షలు స్వీకరించారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్, వ్రత పురోహితులు, అర్చకులతో సహ సుమారు వేయి మంది ఈ దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపం వద్ద సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఖండ దీపం ఏర్పాటు చేశారు. దీక్షలు పూర్తయ్యేవరకు ఈ దీపం వెలుగుతూ ఉంటుందని పండితులు తెలిపారు.

దీక్షలు స్వీకరించిన మూడు వేల మంది

కాకినాడ జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వేయి మంది సత్య దీక్షలు చేపట్టినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. 27 రోజుల పాటు సత్యదీక్షలు కొనసాగుతాయి. డిసెంబర్ నాలుగో తేదీన స్వాములు సత్యదేవుని సన్నిధిన ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించనున్నారు. సుమారు రెండు వేల మందికి ఉచితంగా దీక్షా వస్త్రాలు, మాలలు, పూజ పుస్తకం దేవస్థానం తరపున పంపిణీ చేశారు.

ప్రతీ ఆదివారం సత్య భజన

సత్యదీక్ష చేపట్టిన పురుషులను సత్యదేవ, మహిళలను సత్య లేదా సత్తమ్మగా పిలవాలి. ప్రతి ఆదివారం వార్షిక కల్యాణ మంటపం వద్ద సత్యదీక్ష స్వాములతో భజన ఉంటుంది. డిసెంబర్ మూడో తేదీ రాత్రి ఏడు గంటల నుంచి పడిపూజ నిర్వహిస్తాం. నాలుగో తేదీ ఉదయం ఏడున్నర గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. గిరిప్రదక్షిణ అనంతరం ఇరుముడులు సమర్పించాలి. పురుషులు కేశఖండన చేయించుకోవాలి. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి సత్యదేవుని వ్రతాలు ఆచరించాలి.

– ఈఓ చంద్రశేఖర్ అజాద్

మద్యం తాగి డ్రైవ్ చేసిన 34 మందికి జరిమానా



ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మద్యం సేవించి వాహనాలు నడిపిన 34 మందికి రూ.లక్షా 74 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని, బహిరంగంగా మద్యం సేవించిన 552 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్పీ పి.జగదీష్ మంగళవారం తెలిపారు. గత నెల 29వ తేదీ నుంచి నవంబర్ 6 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. దీనిలో మద్యం సేవించి వాహనాల నడిపే 34 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రజల భద్రత, నేర నియంత్రణలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ మరింత కట్టుదిట్టం చేశామన్నారు. ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ముఖ్యమైన సెంటర్లలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాలలో ప్రజాశాంతికి భంగం కలిగేలాగా మద్యం సేవిస్తున్న వ్యక్తులపై ఓపెన్ డ్రింకింగ్ కేసులను నమోదు చేస్తున్నామన్నారు. వీటిని అరికట్టేందుకు మద్యం మత్తులో పట్టుబడిన వాహన చోదకులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

పంట కాలువలో పడి చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి నాన్సీ (ఫైల్)

తాళ్లరేవు: అభం శుభం తెలియని ఏడాదిన్నర చిన్నారి ఆడుకుంటూ పక్కనే ఉన్న పంటకాలువలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండల పరిధిలోని గోవలంక పంచాయతీకి చెందిన మోర్త వేణుగోపాల్, రమ్య కుమార్తె నాన్సీకి ఏడాదిన్నర వయసు. అప్పటివరకు నాన్సీని ఆడించిన తల్లి రమ్య పనులు చేసుకునేందుకు వీధి తలుపు వేసి లోపలికి వెళ్లింది. అయితే నాన్సీ తలుపు తీసుకుని బయటకు వెళ్లిపోయి ఆడుకుంటూ ఇంటికి సమీపంలోనే ఉన్న పంట కాలువలో పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గుర్తించలేకపోయారు.

కాగా కొద్ది దూరంలో కాలువలో పాప తేలుతుండడాన్ని ఆశా వర్కర్ మాలతి చూసి కేకలు వేసింది. స్థానికులు హుటాహుటిన పాపను బయటకు తీసి యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే నాన్సీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కళ్లముందే ఆడుకుంటున్న పసిపాప అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పాప పుట్టినరోజును తల్లిదండ్రులు ఇటీవలే ఘనంగా నిర్వహించారు. అంతలోనే ఆ పాపకు నూరేళ్లు నిండిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.